క్లుప్తంగా

నేడు ఉచిత దంత వైద్య శిబిరం

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్లలో శనివారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు బైర్రాజు ఫౌండేషన్ కో ఆర్డినేటర్ జంపన భీమరాజు శుక్రవారం తెలిపారు. ఎడాప్టెడ్ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా, విష్ణు డెంటల్ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆయన వివరించారు. శనివారం ఉదయం 8:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మురమళ్ల బైర్రాజు ఫౌండేషన్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్నామన్నారు. మురమళ్ల పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం



సచివాలయ కార్యదర్శులను సత్కరిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి తదితరులు

అమలాపురం రూరల్: మండలంలో ఎ.వేమవరప్పాడు సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన సచివాలయ ఉద్యోగులను సర్పంచ్ పందిరి విజయశ్రీను ఆధ్వర్యంలో సచివాలయం వద్ద శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ పందిరి శ్రీహరి రాంగోపాల్‌లు ముఖ్య అతిథులుగా విచ్చేసి సచివాలయం కార్యదర్శుల సేవలను కొనియాడారు. అనంతరం వారిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మట్టపర్తి నాగరాజు, ఇళ్ళ భీమేశ్వరరావు పాల్గొన్నారు.

మెగా మార్ట్‌లో చోరీ



చోరీ జరిగిన మెగా మార్ట్‌లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

అమలాపురం టౌన్: స్థానిక ఎర్ర వంతెన వద్ద ఉన్న మెగా మార్ట్ షాపులో శుక్రవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. దొంగలు మార్ట్‌లోని రూ.25 వేల నగదును అపహరించారు. మార్ట్‌లోని కొన్ని వస్తువులను కూడా తస్కరించారు. క్లూస్ టీమ్ ఆ షాపునకు వచ్చి చోరీకి సంబంధించిన కొన్ని ఆధారాలను సేకరించింది. మార్ట్ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై ఎస్ఆర్ కిషోర్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వికలాంగులను వేధించడం ప్రభుత్వానికి తగదు

ఉప్పలగుప్తం: అంగవైకల్యాలతో బాధపడుతున్న వికలాంగులకు పింఛన్లు తొలగించి వారిని వేధించడం కూటమి ప్రభుత్వానికి తగదని వైఎస్సార్ సీపీ మండల వికలాంగ విభాగం అధ్యక్షుడు చేట్ల విద్యాసాగర్ అన్నారు. ప్రభుత్వం అందించే పింఛన్లపైనే ఆధారపడుతూ జీవనం సాగిస్తున్న వికలాంగులను వివిధ సాకులతో ప్రభుత్వం తొలగిస్తున్న విధానాన్ని ఖండిస్తూ శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గపు చర్యతో చాలా చోట్ల వికలాంగులు మానసిక ఆవేదనతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

సూరపరాజుకు సన్మానం



కార్యదర్శి సూరపరాజును సత్కరిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు

అమలాపురం రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు, కామనగరువు కార్యదర్శి ఆర్ఎస్ఎస్ సూరపరాజును ఘనంగా సన్మానించారు. గ్రామపంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు శుక్రవారం కామనగరువు గ్రామపంచాయతీ వద్ద అవార్డు గ్రహీత సూరపరాజుకు శాలువా, పూలమాలలతో సత్కారించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగులు, నాయకులు నల్లా సతీష్, విశ్రాంత కార్యదర్శి అడబాల రాజా, ఆదినారాయణ, శ్రీను, రాము అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మెరిట్ జాబితా ప్రకటన

యానాం: యూజీనాన్‌నీట్ కోర్సులైన ఆర్ట్స్, సైన్స్, కామర్స్, వివిధ వృత్తి కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సంబంధించి డ్రాఫ్ట్ మెరిట్ జాబితాను శుక్రవారం సెంటాక్ సంస్థ విడుదల చేసింది. రౌండ్ 1లో అభ్యర్థులు ఇచ్చిన కోర్సుల ప్రాధాన్యత ఆధారంగా 8,386 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఇంకా 3,234 మంది అభ్యర్థులను ఇంజినీరింగ్ (బీటెక్) కోర్సులకు, 3,267 మంది ఆర్ట్స్, సైన్స్ కోర్సులకు మిగిలిన వారిని ఇతర ప్రొఫెషనల్ కోర్సులకు కేటాయించినట్లు తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 23న డాష్‌బోర్డ్ లాగిన్ ఆధారాలను ఉపయోగించి సమర్పించవచ్చన్నారు. అదే రోజునుంచి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, అవసరమైన ఫీజును అలాట్‌మెంట ఆర్డర్‌తో ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్‌కు నివేదించాలన్నారు.

చైతన్యమే శ్రీరామరక్ష

- లింగ నిర్ధారణ నిషేధిత చట్టం అమలుకు చర్యలు
- క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం, తనిఖీలు



ఇటీవల అమలాపురం ఆసుపత్రిలో తనిఖీ చేస్తున్న డీఆర్‌ఓ మాధవి, అడిషనల్ డీఎంఅండ్ హెచ్‌వో భరతలక్ష్మి

అమలాపురం రూరల్: ప్రస్తుత ఆధునిక కాలంలో ఆడ, మగ అనే లింగభేదం లేదు. ఎవరైనా ఒక్కటే అన్న భావన అందరిలోనూ క్రమంగా నెలకొంటుంది. మహిళలకు మాతృత్వం దేవుడిచ్చిన వరమని అందరూ భావిస్తారు. సాంకేతికతతో కూడిన చికిత్స విధానాన్ని ఆసరాగా తీసుకుని కొన్ని స్కానింగ్ సెంటర్లు, వైద్యుల దురాశ వల్ల గర్భంలోనే శిశువు ఉండగానే లింగ నిర్ధారణ చేస్తున్నారు. సమాజంపై అవగాహన లేని మూఢ నమ్మకం కలిగిన వారు పురాతన కాలం నాటి సాంఘిక దురాచారం, విషసంస్కృతిని అవలంబిస్తూ భ్రూణహత్యలకు పాల్పడుతున్నారు. సమాజంలో లింగ వివక్షను రూపు మాపేందుకు వీలుగా 1994లో కేంద్ర ప్రభుత్వం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీపీఎన్డీ) చట్టం ప్రవేశపెట్టింది. ఈ చట్టం సక్రమంగా అమలు చేసేందుకు వీలుగా అధికారులు క్రమం తప్పకుండా జిల్లా ఉన్నతాధికారులు, వైద్యాధికారులు క్షేత్ర స్థాయిలో తరచూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి లింగ వివక్షను నిర్మూలించేందుకు కృషి చేయాలి. పుట్టబోయే బిడ్డ ఆడ అయినా, మగ అయినా ముద్దులొలికే చిరునవ్వుగా భావించాలని చెబుతున్నారు. కడుపులోని బిడ్డ లింగ నిర్ధారణ కోసం ఉపయోగిస్తే పీసీపీఎన్డీ చట్టం ప్రకారం నేరమవుతుందని హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ సమాజంలో మార్పు రావడం లేదు.

అధికారుల సమావేశాలు

అమలాపురం కలెక్టరేట్‌లో ప్రతి మూడునెలలకు పీసీపీఎన్డీ చట్టం అమలుపై వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, లీగల్, స్త్రీ శిశు సంక్షేమం, ఎన్జీవోలతో జిల్లా స్థాయి పర్యవేక్షక కమిటీ సమావేశం కలెక్టర్ మహేష్‌కుమార్ అధ్యక్షతన జరుగుతుంది. అమలాపురం డివిజన్‌లో 44, జిల్లాలో 85 అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నాయి. వీటిలో 13 కేంద్రాలు ప్రభుత్వ స్కానింగ్ కేంద్రాలు. వీటిలో 64 మాత్రమే నూటికి నూరు శాతం పనిచేస్తున్నాయి. అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలు కొత్త రిజిస్ట్రేషన్ల కోసం రెండు దరఖాస్తులు, రెన్యువల్ కోసం నాలుగు దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. స్కానింగ్ కేంద్రాలు మాడిఫికేషన్ కొరకు ఆరు దరఖాస్తులు చేసుకున్నారు. స్కానింగ్ కేంద్రాలు మూసివేతకు సంబంధించి రెండు దరఖాస్తులు అందాయి. గర్భస్థ పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకొని చట్ట ప్రకారం శిక్షలు జరిమానాలు విధిస్తూ లింగ సమానత్వ సాధనకు పాటుపడాలన్నారు. స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు తరచుగా నిర్వహిస్తూ చట్ట ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో 17 ప్రభుత్వ 50 ప్రైవేట్ ఆసుత్రులు, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో పరిధిలోని ఒక ఏరియా ఆసుపత్రితో పాటు 17 పీహెచ్‌సీలు సుమారు ప్రైవేట్ 50 ప్రసూతి ఆసుపత్రులు ఉన్నాయి. భ్రూణహత్యలు నేరమంటూ జిల్లా పేదలు వైద్య ఆరోగ్యశాఖ మూడు నెలలకోసారి స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయడం కొంతమేర ఉపశమనం కలిగిస్తుంది.

చట్టాన్ని ఉల్లంఘిస్తే..

ప్రభుత్వం నుంచి లైసెన్స్ పొందిన స్కానింగ్ సెంటర్లు నిబంధనలను అధిగమించి అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించడం చట్టరీత్యా నేరమని గుర్తించి లైసెన్సులు రద్దు చేస్తామని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. లింగ నిర్ధారణకు సిఫారసు చేసిన వైద్యులు, స్కానింగ్ నిర్వాహకులపై కేసు నమోదు చేసే అధికారం ఉందని పేర్కొంటున్నారు. నేరం రుజువైతే మూడేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తెలిస్తే 1800453365 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా



పిండ ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచాము. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ చట్ట ఆశయ సాధనకు పాటుపడుతున్నాం. శిక్షలు, జరిమానాలు విధిస్తామని స్కానింగ్ సెంటర్లను హెచ్చరించాం. ఇటీవల అమలాపురం, ముమ్మిడివరంలో తనిఖీలు చేశాం.

– సీహెచ్‌వీ భరతలక్ష్మి,
ఏడీఎంహెచ్‌వో, అమలాపురం

పింఛన్ ఇప్పించండి మహాప్రభో..



గౌరీదేవి

అల్లవరం: అంగవైకల్యంతో పుట్టిన పాపానికి పన్నెండేళ్లుగా పింఛన్ మంజూరు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని బోడసకుర్రు మత్స్యకార కాలనీకి చెందిన చిన్నారి సంగాని గౌరిదేవి ఆవేదన వ్యక్తం చేసింది. 2021లో మంజూరు చేసిన సదరం సర్టిఫికెట్లో 72 శాతం అంగవైకల్యం ఉందని అధికారులు ధ్రువీకరించినా నేటికి పింఛన్ మంజూరు చేయలేదని గౌరిదేవి నానమ్మ సంగాని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. కుడి చేయి, కుడి కాలు పోలియో బారిన పడడంతో నడవలేక పడిపోతూ గాయాల పాలవుతుందని, కుడి చేయి పనిచేయక ఎడమ చేత్తోనే అన్నం తింటుందని ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్నో సార్లు అధికారులు చుట్టూ తిరిగినా ఏ అధికారి కనికరించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నా మనవరాలికి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరింది.

ఎస్టీఓగా నేడు బాధ్యతల స్వీకరణ



కోలా కృష్ణ

ముమ్మిడివరం: స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ (ఎస్ఏ)గా పనిచేసిన కోలా కృష్ణ సబ్ ట్రెజరీ ఆఫీసర్ (ఎస్టీఓ)గా పదోన్నతి పొందారు. ముమ్మిడివరం కార్యాలయంలో సుమారు 6 సంవత్సరాలు పాటు ఎస్ఏగా విధులు నిర్వహించారు. ఈ మేరకు ఆయన అమలాపురం ఎస్టీఓగా నియమితులయ్యారు. శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఏపీ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీటీఎస్ఏ) స్టేట్ ప్రెసిడెంట్ పాము శ్రీనివాసరావు, వివిధ స్థాయి అధికారులు, సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

వరద బాధితుల్ని పట్టించుకోని ప్రభుత్వం



బోడసకుర్రు మత్స్యకార కాలనీలో ముంపులో చిక్కుకున్న బాధితులతో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్



మత్స్యకార కాలనీలో ప్రవహిస్తున్న వరద

- రెండు రోజులుగా ముంపులోనే ఉన్నా గుప్పెడు అన్నం కరవు
- నీళ్లు కూడా ఇవ్వలేని స్థితిలో రెవెన్యూ యంత్రాంగం
- వరద ప్రభావిత ప్రాంతాన్ని పరిశీలించిన శ్రీకాంత్

అల్లవరం: ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో అల్లవరం మండలం బోడసకుర్రు పరిధిలోని మత్స్యకార కాలనీలోకి వరద పోటెత్తినా ఈ కూటమి ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదని అమలాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. రెండు రోజులుగా వరద ముంపులోనే ఉన్న బోడసకుర్రులోని మత్స్యకార కాలనీని ఆయన శుక్రవారం సందర్శించారు. మోకాలి లోతు ముంపు నీటిలో జీవనం సాగిస్తున్న బాధితుల్ని పరామర్శించారు. వరద కారణంగా ప్రభుత్వం నుంచి ఏమైనా సాయం అందుతుందా అని బాధితుల్ని అడిగారు. రెండు రోజులుగా ముంపులో ఉన్న కనీసం ఒక్క పూట భోజనం కూడా పెట్టలేదన్నారు. కనీసం నీళ్లైనా ఇవ్వండి అని అడిగితే రెండు బాటిళ్ల నీళ్ల మాత్రమే ఇచ్చారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వస్తున్నారూ తప్ప మా గోడు వారికి పట్టడం లేదని చింతా సుబ్రహ్మణ్యం, బేతాళస్వామి, చింతా గోపాలకృష్ణ, కొల్లు నాగరాజు, వెంకటేశ్వరరావు తెలిపారు. దీంతో వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ శ్రీకాంత్ ముంపు ప్రాంతంలో తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావుతో ఫోన్లో మాట్లాడారు. రెండు రోజులుగా వరద తీవ్రతకు 80 కుటుంబాలు నీట మునిగినా ఇప్పటి వరకు పునరావాస కేంద్రం ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. కనీసం ఒక్క పూట భోజనం కూడా పెట్టలేదని, నీళ్లు ఇవ్వలేదని బాధితులు వాపోతున్నా మీరెందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వరద తీవ్రత మరింత ఎక్కువగా పెరిగే అవకాశం ఉన్నందున ఇప్పటికైనా రెవెన్యూ యంత్రాంగం స్పందించి వరద బాధితులకు పునరావాస కేంద్రం ఏర్పాటుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. వరద బాధితుల్ని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైయ్యిందని ఆయన అన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, మాజీ సర్పంచ్‌లు దొమ్మేటి శ్యాం ప్రకాష్, సాపే ధర్మరాజు, పార్టీ నాయకులు అంబటి శ్రీను, కోలా ధర్మరాజు, గుత్తుల రాజు, గాంధీ, మహంకాళి తదితరులు ఉన్నారు.

వరద తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి



బోడసకుర్రు మత్స్యకార కాలనీలో వరద పరిస్థితిపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ మాధవి

అల్లవరం: వరద తీవ్రత తగ్గే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌ఓ మాధవి అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత నీటమునిగిన బోడసకుర్రు మత్స్యకార కాలనీలో ప్రాంతాన్ని శుక్రవారం అధికారులతో కలసి పరిశీలించారు. డీఆర్‌ఓ మాధవి మాట్లాడుతూ వరద తీవ్రత ఎక్కువైతే సహాయక చర్యలు చేపట్టడానికి సిద్ధం కావాలన్నారు. వరద ప్రస్తుత పరిస్థితిపై రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్యం, మత్స్యశాఖ, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులతో చర్చించారు. గర్భిణులను సమీప పీహెచ్‌సీ లేదా సీహెచ్‌సీకి తరలించాలన్నారు. ఒక్క గర్భిణీ కూడా ఇంటి వద్ద ఉండకుండా పరిశీలించాలని వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చేయాలన్నారు. వరద బాధితులకు రక్షిత మంచినీరు ఇవ్వాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మూడు నెలల రేషన్ అందుబాటులో ఉంచామన్నారు. అనంతరం పల్లిపాలెంలోని రేషన్ డిపోను డీఆర్‌ఓ మాధవి తనిఖీలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, అదనపు డీఎంహెచ్‌ఓ భరతలక్ష్మి, డాక్టర్ స్పందన, డీటీ సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు వస్త్ర, అన్నదానం

అమలాపురం టౌన్: హీరో చిరంజీవి జన్మదినోత్సవం సందర్భంగా ఆయన అభిమానులు శుక్రవారం అమలాపురంలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు. 2వ వార్డులోని మున్సిపల్ పార్కు వద్ద చిరంజీవి అభిమాని నల్లా శ్రీధర్ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. పేదలకు పండ్లు, బిస్కెట్లు అందించారు.

గొల్లవిల్లిలో..

ఉప్పలగుప్తం: మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను మండలంలోని గొల్లవిల్లి గ్రామంలో మండల చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఆయన అభిమానులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమానులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ.10 వేల స్కాలర్‌షిప్ అందించారు.

జిల్లా గణేష్ ఉత్సవ సమితి ఆవిర్భావం



జిల్లా గణేష్ ఉత్సవ సమితి కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: విజయవాడ కేంద్రంగా పని చేస్తున్న రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితికి అనుబంధంగా జిల్లా సమితి ఆవిర్భవించింది. స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లో శుక్రవారం సమావేశమైన హిందూ బంధువులు జిల్లా సమితికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన జిల్లా సమితి తొలి సమావేశం కొన్ని తీర్మానాలు చేసింది. ఆ వెంటనే అమలాపురంలోని కలెక్టర్ ఎం.మహేష్ కుమార్, ఎస్పీ బి.కృష్ణారావును సమితి నూతన కార్యవర్గ ప్రతినిధులు స్వయంగా కలసి ఈనెల 27న జిల్లాలో జరిగే వినాయక ఉత్సవాలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని వినతి పత్రాలు అందించారు. కాగా.. జిల్లా గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీకి జిల్లా అధ్యక్షుడిగా జి.భాను ప్రకాష్, ఉపాధ్యక్షులుగా పెన్మత్స గోపాలకృష్ణంరాజు, బోణం సత్యసాయి, కార్యదర్శిగా అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, సహ కార్యదర్శులుగా ఆకొండి పవన్ కుమార్, గొవ్వాల రాజేష్, కోశాధికారిగా శిష్టా కామేశ్వరరావుతో పాటు 18 మంది జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

తొలి బాధితులు మత్స్యకారులే..



పల్లెగూడెం వద్ద నీట మునిగిన మత్స్యకార ప్రాంతాలు

ఐ.పోలవరం: గోదావరి వరద పోటేత్తి ఇళ్ల మీద వచ్చిపడితే ముందుగా బాధితులుగా మారేది మత్స్యకారులు మాత్రమే. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాలలో వరద ఉధృతికి ఎక్కువగా మత్స్యకారులు నివాసముండే ప్రాంతాలలో నీరు చేరింది. నియోజకవర్గం పరిధిలోని ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలతోపాటు అమలాపురం నియోజకవర్గం పరిధిలో అల్లవరంలో వరద ముంపు ప్రాంతాలు అధికం. గౌతమి, వృద్ధ గౌతమీ, వైనతేయ నదీపాయలను అనుకుని ఏటిగట్టు దిగువున, నదీపాయల మధ్యలో లంక గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో సుమారు 500 కుటుంబాల వరకు మత్స్యకార కుటుంబాలు నివాసముంటున్నారని అంచనా. సాధారణ రోజుల్లో నది పాయల్లో మత్స్య సంపదకు ఢోకా ఉండదు. కానీ వరదలు వస్తే మాత్రం వీరే తొలి ముంపు బాధితులుగా మారిపోతున్నారు. ధవళేశ్వరం వద్ద మూడవ ప్రమాద హెచ్చరికకు వరద చేరితే వీరంతా ఇళ్లను వదిలి పునరావాస కేంద్రాలలో తలదాచుకోవాల్సి వస్తోంది.

అభాగ్యులకు అన్నదానం

తాళ్లరేవు: బ్రహ్మార్పణ్ లయన్స్ ఉచిత అభాగ్యుల భోజన పథకంలో భాగంగా శుక్రవారం గ్రామానికి చెందిన బండారు దొరబాబు ఆర్థిక సహాయంతో అభాగ్యులకు భోజనాలు, పండ్లు పంపిణీ చేశారు. పథకం నిర్వహణలో భాగంగా 966వ రోజున నటుడు, పద్మవిభూషణ్ కొణిదల చిరంజీవి 70వ పుట్టినరోజును పురస్కరించుకుని సుమారు 30 మంది అభాగ్యులకు సహాయం చేసినట్లు తెలిపారు. ఈ సేవ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

గ్రామాలకు పోటెత్తుతున్న వరద

కాట్రేనికోన: గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో దిగువ ప్రాంతాలకు వరద నీరు పోటెత్తుతుంది. మండలంలోని కుండలేశ్వరం పుష్కరఘాట్ సమీపంలో గట్టు దిగబడిపోతున్నా అధికారులు అలసత్వం వీడటం లేదు. మొక్కుబడిగా ఎర్ర జెండాలు కట్టి వదిలేశారు. పుష్కరఘాట్ వద్ద రావిచెట్టును వరద నీరు తాకింది. నడవపల్లి ,పల్లంకుర్రు రేవు, బలుసుతిప్ప ప్రాంతాలకు వరద నీరు చేరడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. బూలావారి మొండి వద్ద ఇటీవల గ్రావెల్ వేసి గట్టుపై నాసిరకం పనులు చేశారు. నాణ్యత లేని పనులుతో గట్టు ప్రమాదం పొంచి ఉంది. పల్లంకుర్రు రేవు ప్రాంతంలో నీరు ఇల్లులోనికి రావడంతో అక్కడ నివాసం ఉంటున్న వారు పడవలపై జీవనం సాగిస్తున్నారు.

దివ్యాంగుల సాధికారతకు కృషి



పర్పుల్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న ట్రైనీ ఐఏఎస్ అఖిల్

యానాం: దివ్యాంగులను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ వారి సాధికారితకు కృషి చేయాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందని ట్రైనీ ఐఏఎస్ అధికారి, మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల పర్పుల్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ దివ్యాంగుల ప్రత్యేక విద్యకు, వారికి కావాల్సిన మౌళిక సౌకర్యాల కల్పన గూర్చి వివరించారు. వివిధ ఎన్‌జీఓ సంస్థల ద్వారా వికాలాంగులు తయారుచేసిన ఉత్పత్తుల ప్రదర్శనలను అందరిని ఆకట్టుకున్నాయి. ఉమా మనో వికాస కేంద్రం చైర్మెన్ ఎస్పీ రెడ్డి, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కో ఆర్డినేటర్ దీపికా ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పాతకోరంగి గ్రామంలో వేంచేసిన బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. అర్చకుడు సాయిప్రసాద్ నేతృత్వంలో సుమారు 150 మంది మహిళలతో సామూహిక వ్రతాలను చేయించారు.

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన శివారు గచ్చకాయలపోర ఎంజీఆర్ కాలనీలో వేంచేసియున్న లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానంలో వరలక్ష్మీ అమ్మవారి వ్రత మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఫణి ఆచార్యుల ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ అర్చన చేపట్టారు.

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం ఆఖరు శుక్రవారం మహా పర్వదినం పురస్కరించుకుని ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుమారు 3 వేలకు పైగా భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గాజుల గౌరీదేవిగా వేపచెట్టు దుర్గమ్మ

అమలాపురం టౌన్: స్థానిక కల్వకొలను వీధిలో వేంచేసిన వేపచెట్టు కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని శుక్రవారం గాజుల గౌరీదేవిగా అలంకరించారు. దాదాపు 25 వేల గాజులతో అమ్మవారిని తీర్చిదిద్దారు. వ్రతాలు చేసిన మహిళలకు లక్ష్మీదేవి రూపులను వీహెచ్‌పీ సమకూర్చగా పూజా సామగ్రిని దాతలు అందించారు. అరిగెల శ్రీను పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మండలంలోని ఉమా సూరేశ్వరస్వామివారి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. పవిత్ర శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు కొత్తలంక సూరిబాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

శాకంబరిగా పాల కనకదుర్గమ్మ

తాళ్లరేవు: పాల కనకదుర్గమ్మ శాకంబరి అలంకరణలో దర్శనమిచ్చారు. పి.మల్లవరం పంచాయతీ గ్రాంటు గ్రామంలో ఓఎన్జీసీ ప్లాంటు వద్ద వేంచేసిన అమ్మవారిని అర్చకుడు కామేశ్వర శర్మ 300 కిలోల కాయగూరలు, పండ్లు, ఆకుకూరలతో విశేషంగా అలంకరించారు.



గాజుల గౌరీదేవిగా వేపచెట్టు దుర్గమ్మ



శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారు